31 వరకు ఉచిత పశువైద్య శిబిరాలు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని పశు రైతుల కోసం ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరాల్లో పశువులకు వైద్య చికిత్స, గర్భకోశ వ్యాధులు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని పశురైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు..!

సమాచారం లేక ప్రజలకు, వ్యాపారులకు తీవ్ర నష్టం - ఇదేమిటని విద్యుత్ వినియోగదారుల అసహనం

ప్రజాశక్తి - వీరవాసరం

ముందస్తు సమాచారం సక్రమంగా ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోయారు. వీరవాసరం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం విద్యుత్ వినియోగదారులకు పూర్తిగా చేరకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. గతంలో విద్యుత్ సరఫరా నిలుపుదలకు సంబంధించి సెల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం వచ్చేది. ఇటీవల కాలంలో ఆ విధంగా సమాచారం వినియోగదారులకు చేరడం లేదు. దీంతో విద్యుత్ సరఫరా ఎప్పుడు, ఎందుకు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఇదేవిధంగా మంగళవారం కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోక నష్టపోయారు. విద్యుత్ సరఫరా నిలుపుదల సమాచారం లేకపోవడంతో పలువురు భవన యజమానులు నిర్మాణ పనులకు కార్మికులను సిద్ధం చేసుకున్నారు. అయితే పని ప్రాంతంలోకి వెళ్లిన తర్వాత విద్యుత్ సరఫరా లేకపోవడంతో భవన యజమానులు కార్మికులకు కూలి చెల్లించడం, అలాగే కొంతమంది కార్మికులకు పనులు రద్దు కావడంతో ఒకరోజు వేతనాన్ని నష్టపోయారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తమ వ్యాపారాలు కొంతమేర స్తంభించాయని వ్యాపారులు తెలిపారు. సుదీర్ఘ సమయం విద్యుత్ సరఫరా నిలుపుదల సమాచారం వినియోగదారులకు చేరవేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలుపుదల సమాచారం ఒకరోజు ముందుగా వినియోగదారులకు చేరితే ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో, అదనపు ఛార్జీల పేరుతో వినియోగదారుల నుండి ఛార్జీల వసూళ్లలో ఉన్న శ్రద్ధ వినియోగదారులకు సేవలందించడంలో లేదని విద్యుత్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు వినియోగదారులకు సకాలంలో సమాచారం అందించాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

దయాలసిస్ సెంటర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లును ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతా

టిడ్కో గృహాలకే తొలి ప్రాధాన్యత - మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాల్టీలో ఒకటిగా పాలకొల్లును తీర్చిదిద్దుతామని, టిడ్కో గృహాలే తన తొలి ప్రాధాన్యత అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాల్టీ పరిధిలో క్రిస్టియన్ శ్మశాన వాటిక, బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, అబ్దుల్ కలామ్ హెల్త్ పార్కు, దాసరి సాయిరాజు, మహాలక్ష్మి స్నానఘట్టం, కైలాస వనం తదితర పనులను సంబంధిత అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పనులను ఒక్కొక్కటిగా సమీక్షించి పురోగతిని, అవసరమైన నిధులు, పట్టే సమయం గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే సహించేది లేదని, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, డిఇలు కె.రాజ్ కుమార్, టూరిజం డిఇ జి.సత్యనారాయణ, టిపిఒ కె.వీరబ్రహ్మం, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దయాలసిస్ సెంటరు పనుల పరిశీలన

పాలకొల్లు వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో దయాలసిస్ సెంటర్ ఏర్పాటు పనుల్లో రోగులకు మంచి వైద్యం అందేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆ సెంటర్ పనులను మంత్రి పరిశీలించారు. దయాలసిస్ సెంటర్‌కు అవసరమైన తాగునీటికి తలెత్తిన ఇబ్బందులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కార చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి కొత్త భవనం నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి ఇంజనీరింగు అధికారులకు, ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. వైద్యాధికారులతోపాటు ఇంజనీరింగు అధికారులు మంత్రి వెంట ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పోడూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రల్లా తీసుకెళ్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వేడంగి, కొమ్ముచిక్కాల గ్రామాల్లో రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ, శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్నారు. వచ్చే నెలలో రాష్ట్రంలో 80 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, ఎంపిడిఒ బి.మంగాకుమారి, డిఇలు కలవకొలను దుర్గారామస్వామి, పి.శ్రీనివాసరావు, రామాయణం త్రిమూర్తులు, ఇఒపిఆర్‌డి కెఎం.వైభవతి, ఎంపిపి సబ్బితి సుమంగళి, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, గ్రామ సర్పంచి చెల్లబోయిన పద్మ పార్వతి శారద, నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పాలవలస తులసీరావు, కోడి విజయభాస్కర్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు పట్టుదలతో శ్రమించాలి



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

దోపిడీరహిత సమాజం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

'పెట్టుబడి-ప్రజాస్వామ్యం' సెమినార్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ మానవాళికి మార్గం చూపిన మహోన్నత వ్యక్తి విఐ.లెనిన్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం పట్టుదలతో శ్రమించినప్పుడే నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో విప్లవ వీరుడు లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 'పెట్టుబడి-ప్రజాస్వామ్యం' అంశంపై సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. సెమినార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత లెనిన్ చిత్రపటానికి సీతారాం, బి.బలరాం, గోపాలన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాం మాట్లాడుతూ ప్రపంచ తొలివెలుగుల ఎర్రజెండా రాజ్య స్థాపకుడు లెనిన్ అని కొనియాడారు. చిన్ననాటి నుండే విప్లవ భావాలతో పెరిగిన లెనిన్ ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. సోషలిజమే ప్రపంచ మానవాళికి మార్గమన్నారు. సోషలిజం కొనసాగుతున్న చైనా, క్యూబా, లాటిన్ అమెరికా దేశాల్లో ప్రజల జీవన పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. కరోనా సమయంలో సోషలిస్టు దేశాల విశిష్టత ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. మన దేశంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వ హయాంలో పేదరికం, నిరుద్యోగం, సంక్షోభాలు, అసమానతలు మరింతగా పెరిగాయని మండిపడ్డారు. అంబానీ, అదానీ ఆస్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి కూడా మోడీ విధానాలనే అవలంబిస్తోందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని సీతారాం పిలుపునిచ్చారు. అనంతరం సరళీకరణ విధానాలు-ప్రజలపై ప్రభావం అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం ఉపన్యసించారు. ఈ సెమినార్‌కు డి.కళ్యాణి ఆహ్వానం పలకగా చింతకాయల బాబూరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం జీవితాన్నే ధారపోసిన వ్యక్తి లెనిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

లెనిన్ శత వర్ధంతి వేడుకలను ఏడాదిపాటు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించామని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. 1920లో లెనిన్ తెచ్చిన రాజ్యం తేవడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

లాంగ్ పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. అపరిష్కృతంగా ఉన్న ప్రాపర్టీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో జిల్లాలోని ముఖ్యమైన కేసుల గురించి ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమైన ప్రాపర్టీ కేసుల గురించి ఆరా తీస్తూ, ప్రాపర్టీ కేసుల్లో ఇప్పటికే ముద్దాయిలు అరెస్ట్ అయిన కేసులలో త్వరితగతిన ఛార్జిషీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీదారులకు చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలన్నారు. ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి గ్రామాల్లో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి నేరాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. పేకాట శిబిరాలు, బెల్టుషాపులను నిరోధించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, ప్రాథమికస్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయలన్నారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే విధంగా సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పిలు ఎంవివి.సత్యనారాయణ, రావూరి గణేష్ జయసూర్య, జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, సిఐలు వి.పుల్లారావు, డి.వెంకటేశ్వరరావు, జివివి.నాగేశ్వరరావు, ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

పాలనపైనే కూటమి దృష్టి

సిఎం, డిప్యూటీ సిఎం అంశంపై చర్చ ఆపాలని పెట్టాలని అధిష్టానం ఆదేశం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో సిఎం, డిప్యూటీ సిఎం అంశంపై సాగుతున్న చర్చను ఆపాలని, పాలనపై దృష్టి పెట్టాలని సిఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు మున్సిపాల్టీలో అభివృద్ధి పనులను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 2014-19లో టిడిపి ప్రభుత్వం వందలాది కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అర్ధాంతరంగా నిలిచిపోయి ధ్వంసమయ్యాయన్నారు. ప్రస్తుతం ఆ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించకుండా బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.5 వేల కోట్లను దారి మళ్లించి లబ్ధిదారుల నెత్తిన అప్పు భారం మోపారన్నారు. 80 శాతంపైన పూర్తయిన టిడ్కో ఇళ్ల పనులను వెంటనే పూర్తి చేసి పేదలకు అందించాలని సిఎం ఆదేశించారని తెలిపారు. స్వచ్ఛభారత్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వాటా కనీసం చెల్లించకపోవడంతోనే చెత్త పేరుకుపోయి అనారోగ్య ప్రదేశ్‌గా మార్చారన్నారు. సమావేశంలో నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ విజయసారధి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయాలి, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తే విశాఖ ఉక్కును ఏవిధంగా పరిరక్షించాలని చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన కొత్తపల్లి

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మంగళవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పవన్ కళ్యాణ్‌కు సుబ్బారాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలోని పలు పెండింగ్ సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి సుబ్బారాయుడు తీసుకొచ్చారు. నియోజవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.



పవన్ కళ్యాణ్‌తో మాట్లాడుతున్న కొత్తపల్లి

అన్నా క్యాంటీన్‌లో రుచి చూసిన కమిషనర్

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డులో అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ స్వయంగా అక్కడ భోజనం చేసి నాణ్యతను పరీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రక్తదానంతో మరొకరికి ప్రాణం పోయొచ్చని ప్రభుత్వ విప్ ఎంఎల్‌ఎ బొలిశెట్టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో రక్తస్రావమై, సమయానికి రక్తం అందుబాటులో లేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం మున్సిపాల్ శాఖ రూ.లక్ష రెడ్‌క్రాస్ సంస్థకు విరాళం అందించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - నరసాపురం

విధి నిర్వహణలో ఉన్న విఆర్‌ఒ గుండెపోటుతో మంగళవారం మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు-1 సచివాలయంలో విఆర్‌ఒగా పనిచేస్తున్న పల్లికొండ దేవిడ్‌రాజు (58) యథావిధిగా మంగళవారం విధులకు హాజరయ్యారు. తోటి ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆయన తాను కూర్చున్న కుర్చీలోంచి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన తోటి ఉద్యోగులు సమీపంలోని తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి దేవిడ్ రాజ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన మొగల్తూరు మండలం పాతపాడు నుంచి తూర్పుతాళ్లుకు బదిలీ అయ్యారు. దేవిడ్ రాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్‌ఒ సంఘం డివిజన్ అధ్యక్షుడు కె.సత్తిబాబు, విఆర్‌ఒలు లక్కు స్వామి, చిరంజీవి, నాగేంద్ర, రేఖ,భారతి, చిన్న, బాలాజీ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, తోటి సిబ్బంది సంతాపం తెలిపారు.

మొగల్తూరు : అందరితో సఖ్యతగా ఉండే విఆర్‌ఒ పల్లికొండ దేవిడ్ రాజు మృతి చెందడం తీరనిలోటని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. ఆర్‌డిఒ మొగల్తూరులోని దేవిడ్ రాజు ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహశీల్దార్లు టి.రాజరాజేశ్వరి, కె.రాజకిషోర్, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ, చక్రవర్తి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



దేవిడ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆర్‌డిఒ (ఇన్‌సెట్లో దేవిడ్ రాజు ఫైల్ ఫొటో)

ఆందోళన చేస్తున్న దళితులు

శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలి

రోడ్డుపై బైఠాయించి దళితుల ధర్నా

ప్రజాశక్తి తణుకు

దళితుల శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలని తణుకు జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇరగవరం రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు కేటాయించిన శ్మశానవాటిక భూమి సరిపోవడంలేదన్నారు. ఉన్న శ్మశానవాటికలో చెట్లు పెరిగి సమాధులను పెకళిస్తున్నాయని, వాటిని తొలగించాలని మున్సిపల్ అధికారులకు తెలియజేశామని తెలిపారు. అయితే వారు సమస్యను పరిష్కరించకపోవడంతో జైభీమ్ యుత్ చెట్లను తొలగిస్తుండగా మున్సిపల్ అధికారులు వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. దాంతో సమస్య పరిష్కారం అవుతుందని మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి కమిషనర్‌ను కలవగా దళితులను అవమానించారన్నారు. న్యాయం జరక్కపోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. దళితులను అవమానించిన కమిషనర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ధర్నాను విరమించుకోవాలని చెప్పగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది.

కాలువ వద్ద చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గవరపేటలో పంట కాలువ గట్టు పక్కన పేరుకుపోయిన చెత్తను గ్రామ సర్పంచి పొలిమేర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. గ్రామస్తులంతా అక్కడే చెత్త వేయడంతో పంట కాలువ దాదాపుగా మూసుకుపోయి నీళ్లు సరిగా ప్రవహించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటమే కాకుండా దోమలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు.

కొప్పర్రు, మల్లవరంలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు, మల్లవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఇ అనిల్ కుమార్ మాట్లాడుతూ వరి పైరులో జింక్ లోపాల లక్షణాలు ఎక్కువగా ఉండడం గమనించడం జరిగిందన్నారు. జింక్ నివారణకు ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి లేదా పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ చొప్పున కలిపి 5 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. అవసరం మేరకు వ్యవసాయ మందులు వాడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎం.సామ్యూల్ జాన్సన్ మాట్లాడుతూ ప్రతి రైతూ ఇ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ టి.స్నేహ, ఎం.మహాలక్ష్మి, రైతులు పోలిశెట్టి బాబా, ముక్కు శ్రీనివాసరావు, బాల వెంకటేశులు, మల్లాడి శ్రీను, ఏలూరు శ్రీనివాస పాల్గొన్నారు.

వ్యవసాయ అనుసంధాన పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాబోయే ఆరు నెలల కాలంలో ఆయా మండలాల్లోని పంచాయతీల్లో వ్యవసాయ అనుసంధాన పనులు వేగవంతంగా జరగడానికి పథక రచన (యాక్షన్ ప్లాన్) చేసుకోవాలని ఎపిడి సిబి జి.కనకదుర్గ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తణుకు క్లస్టర్లోని పోడూరు, పెనుమంట్ర మండలాల్లోని అన్ని పంచాయతీల ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సిబి జి.కనకదుర్గ రాబోయే 6 నెల్లో ఆయా పంచాయతీల్లో చేపట్టాల్సిన వ్యవసాయ అనుసంధాన పనుల గురించి, పంచాయతీ వారీగా యాక్షన్ ప్లాన్ ప్రిపరేషన్ గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివిఎస్ఎన్ శర్మ, తణుకు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వివిఎస్.ప్రసాద్, ఎపిఒ ఎం.బాపూజీ, ట్రైనింగ్ డిఆర్పిలు పి.శ్యామ్, రంగరాజు, శ్రీను అందించారు.

పాఠశాలకు కంప్యూటర్, మిషన్ బహుకరిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

ప్రజాశక్తి - ఆచంట

విద్యా ప్రమాణాల పెంపులో భాగంగా పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలను పూర్వ విద్యార్థులు గుర్తించారు. ఈ సందర్భంగా కొడమంచిలి గ్రామానికి చెందిన చిలుకూరి శ్యామ్ తన వంతుగా ఆ పాఠశాలకు రూ.50 వేలు విలువచేసే కంప్యూటర్ ప్రింటర్‌తోపాటు కుట్టు మిషన్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి నాగేశ్వరరావు, నెక్కంటి రామకృష్ణ, బాలనాగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిని నియంత్రిద్దాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మధుమేహాన్ని ఆహారపు అలవాట్లలో మార్పులు, శారీరక శ్రమతో తరిమికొట్టాలని, షుగర్ వ్యాధిని ఆదిలోనే నియంత్రించాలని జిల్లా జిఎంఎ కోఆర్డినేటర్ పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి గ్రౌండ్స్‌లో పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో తాడేపల్లిగూడెం డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రతినెలా జరుగుతున్న ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక, యోగా, ఆటలతో పాటు మానసిక ప్రశాంతత కోసం పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి వాకర్స్ సభ్యులు డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు రీసర్వేను ఉపయోగించుకోవాలి

తహశీల్దార్ అప్పారావు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో రైతులు తమ పొలాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను ఉపయోగించుకోవాలని తహశీల్దార్ వైవి.అప్పారావు అన్నారు. మంగళవారం ముప్పర్తిపాడులో జరిగిన వరి పొలాల రీసర్వేలో పాల్గొన్నారు. గ్రామంలో రీసర్వే చేయడానికి నాలుగు టీమ్‌లుగా విఆర్ఒ, విఆర్ఎలతో పాటు రెవెన్యూ ఆర్ఐ అధికారులను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల వరిచేల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారన్నారు. గ్రామంలో జరిగే రీసర్వేలో రైతులు పాల్గొని వారి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి విజయరత్నం, ఆర్ఐ గోపి, విఆర్ఒలు పాల్గొన్నారు.

పెదతాడేపల్లి గురుకులంలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలను రిసోర్స్ పర్సన్ బి.యోగానంద్ పరిశీలించారు. పాఠశాల అసెంబ్లీ ప్రార్థన సమావేశం దగ్గర నుండి ప్రతి విషయాన్ని పరిశీలించారు. విద్యార్థులను తరగతుల నిర్వహణ, భోజన సదుపాయాలు, పరిశుభ్రత, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని, వంట చేసే విధానాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం స్వయంగా పిల్లలతో కలిసి భోజనం చేసి పరిశీలించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారత్నం తెలిపారు. పాఠశాల ఆవరణంలోని కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. ఈ సామాజిక తనిఖీలో రిపోర్స్ పర్సన్ బి.యోగానంద్, జి.చంద్రబాబు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

పాలకొల్లు రూరల్:పాలకొల్లు మండలం ఉల్లంపర్రు అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ వాటికలో అంగన్‌వాడీ, సహాయకురాలు కలిసి ఎలాంటి ఎరువులు వాడకుండా పండించిన ఆకుకూరలను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మల్లేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఏ విధమైన రసాయనక ఎరువులు, పురుగు మందులు వాడని ఆకుకూరలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిరోజు ఇలాంటి ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బి.నాగలక్ష్మి, బి.సురేఖ, ఎఎన్ఎం ఆర్.భాగ్యలక్ష్మి, ఆర్.దివ్యభారతి పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి యాజమాన్యానికి ఐఎస్ఒ సర్టిఫికెట్లు

తణుకు:ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పీజీ (అటానమస్) తణుకుకు ఐఎస్ఒ గుర్తింపు పొందిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఐఎస్ఒ ధృవీకరణ కోసం కళాశాలను తనిఖీ చేసేందుకు గాను ఆ సంస్థ నిర్వాహకులు ఆలపాటి శివయ్య కళాశాలకు విచ్చేశారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మి సుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్ఓ 21001:2018, 14001:2015, 50001:2018, మంచి పరిశుభ్రత సాధన సర్టిఫికెట్లను ఆలపాటి శివయ్య కళాశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రతి సచివాలయం వద్దా ఈనెల 20 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకూ లెప్రసీపై సర్వే చేస్తున్నట్లు డాక్టర్ ప్రతాప్ కుమార్ తెలిపారు. సర్వేలో ఎవరికైనా స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే ఆశ, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు గుర్తించాలని తెలిపారు. అనుమానిత కేసులు ఉంటే వైద్యాధికారి, పారామెడికల్ అధికారి పరీక్షించి వారికి మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ఫార్మసిస్ట్ పివి.స్వామి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయిన్ గట్లు ఆక్రమించిన వారిపై చర్యలేవీ?

అధికారులపై ఎంపిటిసిలు ఆగ్రహం

ప్రజాశక్తి - ఉండి

బొండాడ డ్రెయిన్ గట్లను ఆక్రమించి చెరువులు తవ్వకం సాగించే వారిపై చర్యలేవని ఎంపిటిసిలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఉండిలోని బొండాడ డ్రెయిన్‌ను ఆనుకుని సుమారు 14 ఎకరాల వ్యవసాయ భూమిని స్థానిక మత్స్యశాఖ అధికారి రాంబాబు సమక్షంలోనే యజమాని చెరువులుగా తవ్వుతున్నారని స్థానిక ఎంపిటిసి సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిఒ రాంబాబు మాట్లాడుతూ ఆక్వా జోన్‌లోని పొలాలను చెరువులుగా మార్చేందుకు ఎవరి అనుమతులూ అవసరం లేదన్నారు. డ్రెయినేజీ శాఖ జెఇ తిరుమలశెట్టి జయప్రకాష్ మాట్లాడుతూ తాము ఇంతవరకూ చెరువులు తవ్వడానికి అనుమతులు ఇవ్వలేదని, సంబంధిత రైతు డ్రెయినేజీ గట్లు తవ్వి మురుగు కాలువలోకి తూరలు ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువులుగా మారుస్తున్న పొలాల సరిహద్దు రైతు దాట్ల శ్రీనివాసరాజు ఇప్పటికే ఈ వ్యవహారంపై తహశీల్దార్ నాగార్జునకు ఫిర్యాదు చేయగా ఆయన తనకు న్యాయం చేయకపోవడంతో శ్రీనివాసరాజు కోర్టుకి వెళ్లినట్లు తిరుమలశెట్టి జయప్రకాష్ తెలిపారు. ఈ వ్యవహారంలో అసహనం వ్యక్తం చేసిన ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ ఈ సంఘటనకు సంబంధించి నిబంధనలను అనుసరించి చెరువులు తవ్వకం జరిగిందో లేదో తేల్చాలని డ్రెయిన్స్ జెఇ, ఎఫ్‌డిఒలను ఆదేశించారు. ఈ సందర్భంగా డ్రెయిన్స్ జెఇ, ఎఫ్‌డిఒలు బాహాబాహీకి దిగడమే కాకుండా చెరువు యజమానితో డ్రెయిన్స్ జెఇకి ఫోన్ చేయించడం విశేషం. బొండాడ డ్రెయినేజీలోనే తన పొలం ఉందని చెరువు యజమాని చెప్పడం కొసమెరుపు. ఇంతలో కూటమికి చెందిన ఎంపీటీసీలు ఈ వ్యవహారాన్ని స్థానిక శాసనసభ్యులు దృష్టికి తీసుకువెళ్లి నిబంధనలను అనుసరించని వారిపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం

ప్రజాశక్తి - ఉండి

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పంట కాలువ పూడిక పనులు ప్రారంభించడం జరిగిందని డిసి వైస్ ఛైర్మన్, ఉండి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. మంగళవారం ఉండి నుండి అర్తమూరు వెళ్లే పంట కాలువ పూడిక పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంట కాలువ పూడిక పనులను నిర్లక్ష్యం చేయడంతో రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అధిక వర్షాలకు గురై పంట నష్టపోయారని అన్నారు. ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు సూచనల మేరకు ప్రతి పంట కాలువ పూడిక పనులు ప్రారంభించడం జరిగిందని రైతులకు మేలు చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి వినియోగదారుల సంఘం సభ్యులు ముదునూరి సూర్యనారాయణ రాజు, బొప్పుడాల రాంబాబు, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఇరగవరం మండలం ఓగిడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పెన్నాడ రాజు వద్ద తణుకు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ కె.నాగరాజు పాల్గొన్నారు.

భీమవరం టౌన్:వీరవాసరం మండలం బలిసిగోయిపాలెం గ్రామానికి చెందిన ఐ.నాగ సత్యనారాయణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ప్రొఫెషన్ ఎక్సైజ్ సిఐ కె.బలరాం రాజు, ఎస్ఐలు సునీల్‌కుమార్, ఉమామహేశ్వరరావు దాడి చేసి అతని వద్ద నుంచి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

మావుళ్లమ్మకు రూ.50 వేలు విరాళం

భీమవరం టౌన్: మావుళ్లమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన చింతలపాటి సుభాస్ చంద్రబోస్‌రాజు రూ.50,000 కానుకగా మంగళవారం ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు, శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు.

చేప పిల్లలు వేస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

మత్స్యకారుల జీవనోపాధికి తోడ్పాటు

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండల పరిసర ప్రాంతాల్లోని మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి, ఆర్థిక స్వావలంబనకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వెంకటరామన్నగూడెంలో 12 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై 6 లక్షల రోహు, మ్రిగాలా చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. 6 లక్షల చేప పిల్లల్లో దాదాపు 70 శాతం వరకూ బతికి, సుమారు 7 నెలల్లో సుమారు కేజీ బరువు పెరిగి 4.20 లక్షల కేజీల ఉత్పత్తి మత్స్యకారులకు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, ఆర్‌డిఒ తహశీల్దార్ పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు చేయాలి

నరసాపురం:మండలంలోని ఆర్నేళ్ల పిల్లలందరికీ ఆధార్ నమోదు చేసుకోవాలని డిఎల్‌పిఒ ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్, సర్వే, ఆన్‌లైన్ యాప్‌ల పురోగతిపై కార్యదర్శులతో సమీక్షించారు. ప్రభుత్వం నిర్వహించే సర్వేలన్నీ నూరుశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వీటిపై సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో చిట్టవరం, రుస్తుంబాద, తూర్పుతాళ్లు, లిఖితపూడి గ్రామాల్లో ఆధార్ సీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం కొప్పర్రు ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల బాదుడు ఆపాలి

పెనుమంట్ర:కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారం ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ కోరారు. మంగళవారం బ్రాహ్మణచెరువులో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వద్దు, పాత మీటర్లు ముద్దు అని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రావడానికి ముందు జరిపిన పాదయాత్రలో లోకేష్ స్మార్ట్ మీటర్లు వద్దని, వాటి ఏర్పాటు నిర్ణయం వెంటనే రద్దు చేయాలని చెప్పారని, ప్రస్తుతం దానికి వ్యతిరేకంగా చేస్తున్నారని అన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో చెప్పిన విషయాలు మరిచి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజల మీద లేనిపోని అధిక భారాలు వేస్తోందని, ఇది సరికాదని తెలిపారు.

వేమన పద్యాలు ఆదర్శప్రాయం

భీమవరం టౌన్:వేమన పద్యాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని సర్ సివి.రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ వేమన రచనల ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావితరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. బుధవారం పిఎస్ఎం హైస్కూల్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రంగసాయి తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు వరలక్ష్మి, ఎఐ శైలజ, కలిగోట్ల గోపాల శర్మ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు కూటమి ఊపిరి : సీతారామలక్ష్మి

భీమవరం టౌన్:విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే పోరాడంతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారం సంక్షోభం దిశ నుండి అభివృద్ధి దిశగా పయనించడానికి కూటమి ప్రభుత్వం ఊపిరి పోసిందని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో విశాఖ ఉక్కు పరిశ్రమను మూసివేయాలనే కుట్రపై ఉక్కు కర్మాగార ఉద్యోగులు, రాష్ట్ర ప్రజలు చేసిన పోరాటానికి టిడిపి అధినేత అధికారంలోకి రాగానే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని, రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని మంజూరు చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

కోలమూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండి

గ్రామీణ ప్రాంతాల్లో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ఆశ్రం ఆస్పత్రి వైద్య సిబ్బంది అభినందనీయులని బిజెపి నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు అన్నారు. మంగళవారం కోలమూరులో శివ జ్యోతి మెడికల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో 150 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నడింపల్లి సత్యవతి, రాంబాబు రాజు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర మాజీ మంత్రి యువి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, డిటిడిసి బాబు, లయన్ కృష్ణంరాజు మంగళవారం సత్కరించారు. ఉచిత మెగా షుగర్ మెడికల్ క్యాంపులో శ్యామలాదేవి, వారి కుటుంబ సభ్యులు అందించిన సేవలు అద్వితీయమని అన్నారు. కృష్ణంరాజు ఆశయాలకు అనుగుణంగా వారి సతీమణి కుటుంబ సభ్యులు పేద ప్రజలకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం మహా యజ్ఞంలా సాగిందని, ఇటువంటి వైద్య శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేయాలని వారు కోరారు. శ్యామలాదేవి మాట్లాడుతూ భీమవరంలో తలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అన్ని వర్గాల ప్రజలూ సహకారం అందించారని, లండన్ వైద్యులు, అబుదాభి, హైదారాబాద్ వైద్యులచే రెండో రోజు 20 మందికి చికిత్సలు భీమవరంలో అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇటువంటి వైద్య శిబిరాలను భీమవరం చుట్టూ పక్కల ప్రాంతాలలో నిర్వహిస్తామని అన్నారు.

కులగణన అభ్యంతరాల గడువు పెంచాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పెనుగొండ

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ఎస్‌సి, ఎస్‌టి కులగణనకు సంబంధించి వివరాలు వెల్లడి చేయడంలో సచివాలయాలు విఫలమయ్యాయని కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కప్పల రత్నరాజు అన్నారు. మంగళవారం పెనుగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనలో వివిధ రూపాల్లో వ్యక్తమైన అభ్యంతరాలు, సవరణల గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిలో ఉన్న 59 ఉపకులాలు, ఇల్లు ఉన్న 32 తెగల గురించి ఏమాత్రమూ అవగాహన లేని వాలంటీర్లు గ్రామ సచివాలయాల సిబ్బందితో సర్వే చేయించడంలో అనేక పొరపాట్లు తప్పులు గుర్తించామన్నారు. దళితులు, షెడ్యూల్ తెగల జీవన స్థితిగతులను అంచనా వేయడంలో సర్వే సమగ్ర రూపం ఇవ్వలేక పోయిందన్నారు. ప్రభుత్వం సర్వేపై అభ్యంతరాలకు, సవరణలకు తగిన సమయాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, సిఐటియు నాయకులు నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

త్రిమూర్తులకు టిడిపి శాశ్వత సభ్యత్వం

భీమవరం టౌన్:టిడిపి కృష్ణ బలిజ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు, బిసి నాయకుడు గంటా త్రిమూర్తులు, టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి సమక్షంలో టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని మంగళవారం తీసుకున్నారు. భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో లక్ష రూపాయల నగదు రుసుం చెల్లించగా తోట సీతారామలక్ష్మి శాశ్వత సభ్యత రసీదు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి సీనియర్ నాయకుడు గంటా త్రిమూర్తులు బడుగు బలహీన పేదవర్గాల వారికి విద్య, వైద్యం కోసం అనేక విధాలుగా సహాయపడుతుంటారని తెలిపారు. వారు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. గంటా త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్‌బాబు, పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

కెపిపాలెం నార్త్‌లో రీసర్వే

మొగల్తూరు : మండలంలోని కెపి పాలెం నార్త్ లో రీసర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా రీ సర్వే పనులను మంగళవారం తహశీల్దార్ కె.రాజకిషోర్ డివిజనల్ సర్వేర్ కుమార్ సందర్శించారు. సర్వేకు ప్రజలందరూ కూడా సహకరించాలని, సిబ్బంది ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

CHANGE OF NAME

I, **YANUMULA SWATHI,** W/o **YENUMULA MOHINDAR NAG** resident of D.No. 4-98/C, Bantty residence Dum Dum gardens, Nuzvid Town & Mandal, Eluru District. I have changed my name from **YANUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (Old Name) to **YENUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (New Name). Hereafter my name is known as **YENUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (New Name). for all purposes.

CHANGE OF NAME

I, **INJETI RAVI KUMAR** S/o. Injeti Ramarao, D.No. 2-139, Kotha Harijanapeta, Yenuguvanilanka, Yelamanchili Mandal, W.G.Dt., A.P. I have changed my name from **INJETI RAMESH** (Old name) to **INJETI RAVI KUMAR** (New name) hence after all my documents and correspondence will be countinue with my New name **INJETI RAVI KUMAR**

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఇసుక గరువు, పెనుమంచిలి గ్రామానికి చెందిన బాలం బాలమురళి, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నాయొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. పెనుమంచిలి ఇంటి దగ్గర నుండి జిరాక్స్ నిమిత్తం ఆచంట వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్ట్ నెంబర్ **N8690977** గల పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బాలం బాలమురళి
తండ్రి : నాగేశ్వరరావు
డోర్ నెం: 2-94
ఇసుక గరువు, పెనుమంచిలి
ఆచంట మండలం, ప॥గో॥ జిల్లా
సెల్: 75691 95867

CHANGE OF NAME

I, **INJETI SUVARNA KUMARI** W/o. Injeti Ravi Kumar, D.No. 2-139, Kotha Harijanapeta, Yenuguvanilanka, Yelamanchili Mandal, W.G.Dt., A.P. I have changed my name from **INJETI SUVARNA** (Old name) to **INJETI SUVARNA KUMARI** (New name) hence after all my documents and correspondence will be countinue with my New name **INJETI SUVARNA KUMARI**

మహారాజశ్రీ అడిషినల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో
I.A. No. 996/2024 In O.S. No. 5/2022

Between:
1. మెతుకుమల్లి రామతులసీ ...Petitioner
మరియు
2. సిరంగి దానయ్య అండ్ అదర్స్ ...Respondent

పై నెంబరు దావాలో 5వ ప్రతివాదికి LRS అయిన R6 సముద్రాల మహేశ్వరి W/o Late లీలా మహేశ్వరరావు R/o D/N. 8-31/17 R.R పేట, ఏలూరు, ఏలూరు జిల్లా.
R7 సముద్రాల రాజేష్ S/o Late లీలా మహేశ్వరరావు R/o D/N. 8-31/17 R.R పేట, ఏలూరు, ఏలూరు జిల్లా.
ప్రతివాదులు అయిన మీరు నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 3-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల పై నంబరు దావాలో మీ పరోక్షము విచారించబడును.
(పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం)
N.Y.V. ప్రసాద్
ఏలూరు **N. రాముడు**
ది. 20-01-2025 అడ్వకేట్స్ ఏలూరు

ఉత్సవాలు, అన్నసమారాధన అభినందనీయం : ఎస్ఐ

మొగల్తూరు :అమ్మవారి పేరుతో ప్రజలందరూ ఐకమత్యంతో ఉత్సవాలు, అన్న సమారాధనలు చేయడం అభినందనీయమని ఎస్ఐ జి.వాసు అన్నారు. మొగల్తూరులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నడివీధి ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతరలో ప్రజలందరూ ఎటువంటి పొరపాట్లు జరగకుండా సహకరించారన్నారు.

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 309/2022

Between:
చదలవాడ థామస్ ...వాది
మరియు
సిర్రా ఆశీర్వాదం అండ్ అదర్స్ ...ప్రతివాదులు
8th Defendant
కొడమంచిలి కనకరత్నం W/o మోషే, ఆచంట వేమవరం, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు గ్రంధములో 8వ ప్రతివాది మరియు I.A No.219/2022 లో 8వ రెస్పాండెంటు గాను చూపించబడియున్నారు. మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపించినను, వాటిని మీరుతీసుకొనక తప్పించుకు తిరుగుచున్నారు. కావున పై కేసు మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 7-02-2025 తేదిన** వాయిదా అయ్యి ఉన్నది. కావున మీరు **ది. 7-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క అభ్యంతరములు పై కోర్టు వారికి తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారణ జరుగునని తెలియపర్చడము అయినది.
// By orders //
కోమట్లపల్లి వెంకటశ్రీ రామారావు
తణుకు అడ్వకేట్
ది. 21-01-2025 తణుకు
సెల్: 83099 70708

మహారాజశ్రీ సివిల్ జడ్జి వారి కోర్టు (జూనియర్ డివిజన్): పాలకొల్లు
O.S. No. 24/2024

Between:
యిళ్ళ సూర్యవతి ...వాది
Vs
వట్టికూటి విఘ్నేశ్వరి ...ప్రతివాది
To.
వట్టికూటి విఘ్నేశ్వరి భర్త: హనుమంతరావు, పండిత విల్లూరు, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు పంపించినప్పటికి తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ఆదేశముల మేరకు మీ హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. వాయిదా **ది. 03-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొనగలరు. లేని యెడల సదరు విషయముపై మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఆదేశాలు మేరకు)
శ్రీ I. శివ సాంబమూర్తి & కుక్కల రాంబాబు
పాలకొల్లు అడ్వకేట్స్
ది. 20-01-2025 పాలకొల్లు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్): పాలకొల్లు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఒ.యస్.నెం. 116/2023

బిట్వీన్:
శిద్దాని జగదీశ్వరరావు, తండ్రి: కోటి వీరభద్రం, వయసు: 62 సం.లు, ఎ.పి.హెచ్.బి.కాలనీ, పాలకొల్లు-534260, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా. ...వాది
వెర్సెస్
జవ్వాది సురేష్, తండ్రి: కోటి త్రిమూర్తులు, వయసు: 35 సం.లు, డోర్ నెం: 2-42, శివాలయం వీధి, మట్టపర్రు-534265, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా.
ప్రస్తుత నివాసం: ఉల్లింగల కాసులమ్మ గారి ఇల్లు, సెకండ్ ఫ్లోర్, స్ట్రీట్ నెం.3, యాదవుల స్ట్రీట్, సుంకం పద్దయ్య వీధి, స్కూల్ దగ్గర, భీమవరం-534201, ప॥గో॥జిల్లా. ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన జవ్వాది సురేష్ గారికి కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు సమన్లు పంపించినప్పటికిన్నీ, అతను ఉదేశ్య పూర్వకముగా సమన్లు తీసుకొకుండా దావాను కాలయాపన చేసే ఉద్దేశ్యముతో ఉన్నందున, ఈ ప్రకటన ద్వారా ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తము **ది. 10-02-2025 తేదీకి** శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. కావున ఆ తేదీన శ్రీ కోర్టు వారి ముందు ప్రతివాది అయిన మీరు **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనవలను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
యస్.కె. రామలింగేశ్వరరావు
పాలకొల్లు వాది తరపు న్యాయ వాది
ది. 20-01-2025 పాలకొల్లు
సెల్: 9849132391

TMB Tamilnad Mercantile Bank Ltd
Be a step ahead in life
తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టరు ఆఫీసు: 57, వి.ఇ.రోడ్, తూతుకుడి-628002
Website : www.tmb.in
తాడేపల్లిగూడెం శాఖ, ఫోన్ : 08818 - 221408, 222890

బంగారు నగల వేలం ప్రకటన

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	లోన్ తీసుకున్న తేదీ	బంగారం బరువు గ్రా॥	లోను మొత్తం	కట్టవలసిన మొత్తం
1	1247003 00117451	నారాయణ అప్పారావు, S/o. రామారావు, 7-44-5/2, 11వ వార్డు, కుంచనపల్లి రోడ్, తాడేపల్లిగూడెం పిన్: 53410	27-02-2023	98.9	3,00,000/-	3,63,450.56/- + Other Expenses

పైన ఉదహరించిన బంగారు నగలపై అప్పును తీసుకున్న ఖాతాదారుడు తిరిగి చెల్లించని కారణముగా బ్యాంక్ నిబంధనల ప్రకారం ది. 04-02-2025 (మంగళవారం) సాయంత్రం గం॥ 4.30 ని॥లకు మా **తాడేపల్లిగూడెం బ్రాంచి** ఆవరణలో వేలం వేయబడును.

1. హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 2. నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ లేదు. 3. ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గాని, వాయిదా వేయుటకు గాని, వేలం ఆపుటకు గాని, రద్దుచేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 4. ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 5. అప్పు, వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవలెను.

తేదీ: 21-01-2025 సం/- బ్రాంచి మేనేజరు, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్